


దీప్తిశ్రీనగర్‌లో ప్రధాన రోడ్డుపై నిలిచిన వరదనీరు



మదీనాగూడ జాతీయ రహదారిపై నీటి తొలగింపు పనుల్లో జీహెచ్‌ఎంసీ సిబ్బంది



లింగంపల్లి అండర్‌బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తదితరులు

వర్షం.. అతలాకుతలం..



పాపిరెడ్డినగర్ కాలనీ నుంచి లింగంపల్లి అండర్ బ్రిడ్జివద్ద వరద నీటిలోనే వాహనాలు రాకపోకలు సాగిస్తున్న దృశ్యం

- లింగంపల్లి అండర్‌బ్రిడ్జి కింద వరదనీరు.. మళ్లీ ఆగిన రాకపోకలు
- జంట సర్కిళ్ల పరిధిలో ప్రధాన, అంతర్గత రోడ్లపై నిలిచిన నీరు
- వాహనదారుల ఇక్కట్లు

శేరిలింగంపల్లి జోన్ బృందం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కాలనీలు ,బస్తీలు అతలాకుతల మయ్యాయి. అంతర్గత, ప్రధాన రోడ్లపైకి వరద నీరు భారీగా రావడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. పలుచోట్ల రోడ్లు జలమయ మయ్యాయి. దీనికితోడు రోడ్లపక్కనే ఉండే మురుగు కాలువలు పొంగి పొర్లాయి. పలుచోట్ల రోడ్లపై వరద నీరు గంటలపాటు నిలిచిపోవడంతో రాకపోకలు నెమ్మదిగా సాగాయి. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిల్ పరిధిలోని చందానగర్, మాదాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్లలోని కాలనీలు ,బస్తీలలో వర్షంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. మియాపూర్‌లోని జేపీనగర్ ప్రాంతంలో 39.5 ఎంఎం వర్షం కురిసింది.

మళ్లీ లింగంపల్లి అండర్‌బ్రిడ్జి కింద వరదనీరు..

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు వచ్చి చేరింది.





మాదాపూర్‌లో రోడ్ల దుస్థితి.... వర్షంలో రోడ్డుపై మొరాయించిన వాహనం

- దీంతో వాహనాల రాకపోకలు గురువారం కూడా నిలిపివేశారు. బ్రిడ్జి కింద రెండువైపులా బారికేడ్లు అడ్డంగా పెట్టారు.
- లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపు, ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఔటర్ రింగురోడ్డు వైపు వెళ్లాల్సిన వాహనాలను నల్లగండ్ల ఫ్లైఓవర్ వైపు మళ్లించారు.

పలుచోట్ల రోడ్లపై వరద

- మదీనాగూడ, గచ్చిబౌలి, దీప్తిశ్రీనగర్, హఫీజ్‌పేట్, బయోడైవర్సిటీ పార్కు కూడలి, విప్రో సర్కిల్, మదీనాగూడ జాతీయ రహదారి, వైశాలినగర్, లింగంపల్లి, నల్లగండ్ల ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు, ఖాజాగూడ, రాయదుర్గం, నల్లగండ్ల మార్కెట్ రోడ్డులో, చందానాయక్ తండా, మాదాపూర్‌లో పలుచోట్ల కూడా రోడ్లపై వరద నీరు చేరింది.
- మధురానగర్‌లో ఆలయం పక్కన మోడల్ కారిడార్ నిర్మాణం కోసం తవ్వకాలు జరిపి పనులను పూర్తి చేయకపోవడంతో ఆ ప్రాంతయంతా బురదమయంగా మారింది.

రోడ్లపై జీహెచ్‌ఎంసీ సిబ్బంది, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్లపై నీరు నిలిచిపోవడం వంటి ఘటనలు చోటు చేసుకోవడంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, డీఆర్‌ఎఫ్ సిబ్బంది, సైబరాబాద్ ట్రాఫిక్, సివిల్ పోలీసులు రోడ్లపైకి వచ్చారు.
- పలు చోట్ల నీరు సాఫీగా వెళ్ళేలా చర్యలు తీసుకున్నారు. కాలువలు, నాలాల వద్ద వ్యర్థాలు అడ్డుపడకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో వరద నీరు సాఫీగా పారింది.

సెలవులతో ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం కూడా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

అస్తవ్యస్తంగా రోడ్లు

మాదాపూర్: మాదాపూర్ ఐటీ ప్రాంతం కావడంతో ఒకేసారి ఐటీ ఉద్యోగులు బయటికి రావడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. వర్షాలకు ఎక్కువ శాతం కార్లు వినియోగించడంతో ట్రాఫిక్ పెరిగింది.

దీన్ని అధిగమించడానికి సైబరాబాద్ పోలీసుల సూచన మేరకు ఉద్యోగుల సమయాల్లో మార్పు చేశారు.

- మాదాపూర్‌లోని సాయినగర్, గఫూర్‌నగర్, చంద్రనాయక్‌తండా, సర్వే ఆఫ్ ఇండియా, ఇజ్జత్‌నగర్ తదితర ప్రాంతాలలో వర్షాల కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వర్షంతో వ్యాపారం లేదు



ఎడతెరపి లేని వానలతో వ్యాపారం జరగడం లేదు. కూరగాయలు ఎక్కువ రోజులు నిలవ ఉండకపోవడంతో పారేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

–జాదవ్, స్థానికుడు

సమస్యలుంటే .. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

- జీహెచ్‌ఎంసీ కంట్రోల్ రూం: 9704601866
- జీహెచ్‌ఎంసీ ట్రీ కటింగ్ : 6309062583
- వాటర్ లాగింగ్ : 9000113667
- ఎలక్ట్రిసిటీ కంట్రోల్ : 9440813750
- ఎన్‌డీఆర్‌ఎఫ్ : 8333068536
- ఎంసీహెచ్ డిజాస్టర్ టీం: 9704601866
- జీహెచ్‌ఎంసీ బెగ్గర్స్ లిఫ్టింగ్: 9154901720
- ఫైర్ కంట్రోల్ : 101
- మాదాపూర్ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడితే : 9490617257 ఈ సేవలను వినియోగించుకోవచ్చు.



నల్లగండ్ల కూరగాయల మార్కెట్ రోడ్డులో మ్యాన్ హోల్ సరిచేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది



మాదాపూర్‌లో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది



మాదాపూర్‌లో వర్షంలో పారిశుద్ధ్య పనులు చేపట్టిన కార్మికులు



లింగంపల్లిలోని ఆలింద్ కాలనీలో..

క్లుప్తంగా

వరద ప్రాంతాల్లో పోలీసు అధికారుల పర్యటన

శేరిలింగంపల్లి: వర్షాల నేపథ్యంలో శేరిలింగంపల్లి ప్రాంతంలో సైబరాబాద్ పోలీసు అధికారుల బృందం గురువారం సాయంత్రం పర్యటించింది. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆధ్వర్యంలో మాదాపూర్ డీసీపీ సందీప్‌రావు, మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, సీఐలు పాలవెల్లి, సంజయ్‌కుమార్, ఆర్‌సీపురం సీఐ పవన్ కుమార్, చందానగర్ డీఐ వెంకటేశం, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి పర్యటించారు. లింగంపల్లిలోని గోపి చెరువు, నల్లగండ్ల చెరువులను పరిశీలించి చెరువుకట్టల పటిష్టత, నీటి నిల్వ, భారీ వర్షం పడితే నెలకొనే పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షం వచ్చే అవకాశం ఉంటే వెంటనే చెరువులోని కొంత నీటిని ఖాళీ చేయాలని సూచించారు. అనంతరం లింగంపల్లిలోని రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని సీపీ పరిశీలించారు. ప్రత్యామ్నాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్లగండ్లలో సెల్లార్ల తవ్వకాలతో అపార్ట్‌మెంట్ల ప్రహరీగోడలు కూలిన ప్రాంతాన్ని, డాక్టర్స్ కాలనీలో సఖి నిర్మాణ సంస్థ సెల్లార్ ప్రాంతాన్ని పక్కనే ఉన్న ఆభరణ అపార్ట్‌మెంట్‌ను, అందులోని వారు కొందరు ఇళ్ళను ఖాళీ చేసిన విషయాన్ని తెలుసుకున్నారు. ట్రాఫిక్ జామ్ కాకుండా, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా, జీహెచ్‌ఎంసీ అధికారులు, ఇతర విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సీపీ అధికారులకు ఆదేశించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మియాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన ప్రకారం.. మియాపూర్‌లోని బొల్లారం ఎక్స్ రోడ్డు వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పక్కన ఓ వ్యక్తి (40-45) పడి ఉన్నాడని స్థానికులు మియాపూర్ పోలీసులకు బుధవారం రాత్రి 10 గంటలకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే అతను మృతి చెంది ఉన్నాడు. అతని వద్ద ఎలాంటి సమాచారం లభించలేదు. స్థానికులను ఆరా తీయగా యాచకుడుగా చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో తిరుగుతూ మద్యం తాగుతూ ఉండేవాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జాతీయ విద్యావిధానంతో నైపుణ్యం పెంపుదల



జాతీయ విద్యా విధానం ప్రగతిపై మాట్లాడుతున్న గోపాలకృష్ణ

ఎన్‌వీఎస్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ

గచ్చిబౌలి: జాతీయ విద్యా విధానంతో విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెరిగాయని నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ టి.గోపాలకృష్ణ అన్నారు. గురువారం గచ్చిబౌలిలోని నవోదయ విద్యా సమితిలో 'జాతీయ విద్యా విధానం-2020' ప్రగతిపై నవోదయ సమితి, కేంద్రీయ విద్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గోపాలకృష్ణ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)-2020 దిక్సూచిగా మారిందన్నారు. సాంకేతిక వినియోగంతో కళ, బొమ్మ, క్రీడల ఆధారిత బోధన, అనుభవ పూర్వకమైన అభ్యాసంతో విద్యార్థులలో నైపుణ్యాలు పెరుగుతున్నాయన్నారు.బెంగళూర్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో 240 మంది విద్యార్థులకు గానూ 225 మంది ఐఐటీకి వెళ్లారని తెలిపారు. ఎన్ఈపీని అమలు చేసేందుకు ఉపాధ్యాయులకు నిరంతరం శిక్షణ ఇస్తున్నామని, ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమన్నారు. జెఎన్‌వీ అసిస్టెంట్ కమిషనర్ అభిజిత్ బెహరా మాట్లాడుతూ టీచింగ్, లెర్నింగ్‌లో అనేక మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్, కంప్యూటర్ పరిజ్ఞానం అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జెఎన్‌వీ డీసీ జగదీశ్వర చారీ, అసిస్టెంట్ కమిషనర్ శాంతి, గచ్చిబౌలి కేవీఎస్ ప్రిన్సిపాల్ జితేంద్ర కుమార్, నవోదయ రంగారెడ్డి ప్రిన్సిపాల్ విజయ భాస్కర్, కేవీ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రిన్సిపాల్ మిత్రవింద తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని బస్ బాడీ వద్ద మయూరీనగర్ నుండి వచ్చే నాలా అవుట్‌లెట్‌ను, డోవా కాలనీలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట జీహెచ్‌ఎంసీ అధికారులు ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ శ్రీకాంతిని, డీఈ దుర్గాప్రసాద్, ఏఈ శివప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మియాపూర్ దోవా కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే గాంధీ, అధికారులు

నివాళి

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఈరమ్మ స్వర్గస్థులైన సందర్భంగా గురువారం ఆమె పార్థివదేహం వద్ద ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతి, శ్రీనివాస్ చౌదరి, రజినీకాంత్, ఇమామ్, రూప పాల్గొన్నారు.

రాకపోకలు బంద్

జిన్నారం(పటాన్‌చెరు): భారీ వర్షాలు కురుస్తుండటంతో జిన్నారంలోని రాయిన్‌చెరువు అలుగు పారుతుంది. జిన్నారం-జంగంపేట గ్రామాల మధ్య ఉన్న రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రోడ్డుపై భారీగా వరద నీరు పారుతుండటంతో అధికారులు రాకపోకలు చేయకుండా రోడ్డుపై కంచెలు, కట్టెలను అడ్డుగా పెట్టారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



కట్టారు.. తాళం వేశారు

వృథాగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ .. మోడల్ మార్కెట్

- రూ.3.90 కోట్లతో ఖాజాగూడలో మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్
- రూ.50 లక్షలతో టీఎన్‌జీఓ కాలనీలో మార్కెట్
- కోట్లు వెచ్చించినా ఫలితం లేదాయే..

రాయదుర్గం: లక్షలు వెచ్చించి నిర్మించారు. వాటిని అలాగే వదిలేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలో జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇండోర్ స్టేడియం నిర్మించి ఏళ్ళు గడుస్తున్నా క్రీడాకారులకు అందుబాటులోకి రాలేదు. అదే తరహాలో టీఎన్‌జీఓ కాలనీలో మోడల్ మార్కెట్ కూడా వృథాగా ఉంది. ఈ రెండింటిని కలిసి దాదాపు నాలుగున్నర కోట్లతో నిర్మించినా ఫలితం లేదనే అభిప్రాయం కలుగుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

11 ఏళ్లుగా..

- క్రీడాకారుల సౌకర్యార్థం ఖాజాగూడలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించారు. మొదట అవుట్‌డోర్, ఇండోర్ రెండింటినీ నిర్మించాలని తలపెట్టి, తర్వాత ఇండోర్ నిర్మించారు.
- రూ.3.90 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియంను రెండేళ్ల క్రితం పూర్తి చేశారు. ఐతే తాళం వేసి ఉంచారు.
- ఈ ఇండోర్ స్టేడియంను కరోనా వ్యాక్సినేషన్ కోసం వినియోగించుకున్నారు ప్రస్తుతం మూసివేయడంతో క్రీడాకారుల కల అలాగే మిగిలింది.
- 6 కోట్లతో నిర్మించనున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు జూలై 21-2012న అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు.
- నిధుల విడుదలలో జాప్యంతో అయిదేళ్ళ క్రితం ఇండోర్‌స్టేడియం నిర్మించారు.
- ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నాలుగు బ్యాడ్మింటన్ కోర్టులు, క్యారమ్స్, చెస్, మినీ జిమ్, యోగా గది, పరిపాలనాధికారి కార్యాలయం, రెస్ట్ రూమ్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు
- అవుట్ డోర్‌లో వాలీబాల్, క్రికెట్ ఆడేందుకు ఏర్పాట్లు చేయాలని తలపెట్టినా ఆ స్థలంలో ఫ్లైఓవర్ల నిర్మాణంలో వినియోగించే రెడీమేడ్ నిర్మాణాల తయారీ కేంద్రం ఏర్పాటు చేయడంతో వీలు లేకుండా పోయింది.

మోడల్ మార్కెట్ ..

మోడల్ మార్కెట్ల నిర్మాణానికి ఏడేళ్ళ క్రితం ప్రాధాన్యత ఇచ్చి గచ్చిబౌలి డివిజన్‌లో దీన్ని టీఎన్‌జీఓ కాలనీలో నిర్మించారు. ఇళ్ళు నిర్మాణం ఇంకా పూర్తి స్థాయిలో చేయని స్థలంలో ఏర్పాటు చేయడంతో వ్యాపారాలు నిర్మించినా దుకాణాలు తీసుకొనేందుకు వెనుకడుగు వేయడంతో దీన్ని నిర్మించినా మూసి ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ప్రహరీ లోపల పిచ్చిమొక్కలు చెత్తాచెదారంతో నిండిపోయింది.ప్రస్తుతం పెద్ద ఎత్తున కాలనీ ఏర్పడినా దీన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టలేదు.

- అయిదేళ్ళ క్రితం రూ.50 లక్షల వ్యయంతో మోడల్ మార్కెట్ నిర్మాణం చేశారు.
- చుట్టూరా ప్రహరీగోడ, గేటు, గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్థులతో నిర్మించారు. వీటిలో దుకాణాలు, మరుగుదొడ్ల నిర్మాణం చేసి వదిలేశారు.
- అనువుగాని చోట నిర్మాణంతో దుకాణాన్ని అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకురాకపోవడంతో రెండేళ్ళుగా తాళం వేసి ఉంచారు.

ఇలా చేస్తే మేలు.....

- ఇండోర్ స్టేడియంను క్రీడాకారులకు తక్షణం అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.
- అవుట్‌డోర్ స్టేడియం కోసం ఫ్లైఓవర్ నిర్మాణ సామగ్రి తయారీ కేంద్రం, చెత్త సేకరణ కేంద్రాన్ని మరో అనువైన చోటుకు తరలించాలి.
- అవుట్‌డోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తక్షణం చేపట్టాలి
- క్రీడాకారులకు తక్కువ రుసుముతో ఆడుకోవడానికి అవకాశం కల్పించాలి
- ప్రతియేటా సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను కూడా ఇక్కడ నిర్వహించుకోవచ్చు
- మోడల్ మార్కెట్ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చేలా చూడాలి.
- ఈ రెండింటిని వినియోగంలోకి తీసుకొస్తేనే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.



ఖాజాగూడలో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ స్టేడియం ఇదే



టీఎన్‌జీఓ కాలనీలో నిర్మించిన మోడల్ మార్కెట్ భవనం